సాక్షి
వికారాబాద్

బుధవారం । 4 । జూన్ । 2025



సద్వినియోగం చేసుకోవాలి

భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. 8లో ▸



రైతుల సంక్షేమమే ధ్యేయం

రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 8లో ▸



టీబీ పరీక్షలు తప్పనిసరి

రెండు వారాల పాటు దగ్గు ఉంటే టీబీ పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ రవీంద్రయాదవ్ సూచించారు. 9లో ▸

క్లుప్తంగా

పెన్షన్ల కోసం దరఖాస్తులు స్వీకరించండి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: అర్హులైన వారి నుంచి పెన్షన్లకు దరఖాస్తులు స్వీకరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన జాతీయ కుటుంబ ప్రయోజన పథకంలో రైతు ఆత్మహత్య కుటుంబాలు, వితంతు పెన్షన్లు అంశాలపై సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్, అదనపు కలెక్టర్లు, డీఆర్డీఓ, రెవెన్యూ విభాగాల అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మాట్లాడుతూ.. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు, వితంతు పెన్షన్లకు సంబంధించి ఆర్థిక సాయం పొందేలా దరఖాస్తులు స్వీకరించి ప్రతిపాదనలు పంపాలన్నారు. అర్హులకు పెన్షన్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూమ్ సమావేశంలో డీహెచ్ సూపరింటెండెంట్లు వెంకటేశ్వరి, నేమత్ అలీ, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ మహమూద్ అలీ, డీపీఎం నర్సింలు పాల్గొన్నారు.

9న దివ్యాంగుల ప్రత్యేక శిబిరం

అనంతగిరి: దివ్యాంగుల కోసం ఈ నెల 9న కొడంగల్ బాలికల జెడ్పీహెచ్ఎస్‌లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు జిల్లా సంక్షేమాధికారి జయసుధ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏడీఐపీ పథకంలో దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ మోటరైజ్డ్ ట్రై సైకిల్స్, హ్యాండ్ ప్రొపెల్లెడ్ ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, హియరింగ్ ఎయిడ్స్ తదితర సహాయ పరికరాలు అందజేసేందుకు అర్హత ఉన్న లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని చెప్పారు. సహాయ ఉపకరణాలు పొందేందుకు 40 శాతం వైకల్యం తప్పనిసరి అన్నారు. శిబిరానికి హాజరయ్యే వారు రూ.22,500 కన్న తక్కువగా ఉన్న ఆదాయ ధ్రువీకరణ పత్రం(ప్రభుత్వ అధికారికంగా లేదా సర్పంచ్, మేయర్, ఎమ్మెల్యే, ఎంపీ లేదా బీపీఎల్ రేషన్ కార్డ్ లేదా దివ్యాంగ పెన్షన్ రుజువు ద్వారా జారీ చేయబడింది), దివ్యాంగ జన ఆధార్ కార్డు, యూడీఐడీ కార్డుతో శిబిరానికి హాజరవ్వాలన్నారు. మరింత సమాచారానికి 82475 66442 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సదస్సులు సద్వినియోగం చేసుకోండి



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

- సమస్యల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం చొరవ చూపాలి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. మంగళవారం ఆయన వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎర్రవల్లి, ఆలంపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దరఖాస్తుల వివరాలను తహసీల్దార్ లక్ష్మీనారాయణను అడిగి తెలుసుకున్నారు. సాదాబైనామా, పీఓపీ, భూ విస్తీర్ణంలో మార్పులు, చేర్పులు, పాస్ పుస్తకాల అందజేత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా రెవెన్యూ యంత్రాంగం చొరవ తీసుకోవాలని చెప్పారు. సదస్సులో వచ్చిన అర్జీల రిజిస్టర్‌ను పరిశీలించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్ మండల పరిధిలోని పెండ్లిమడుగులో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంపీఓ దయానంద్, పంచాయతీ కార్యదర్శి శ్రీజ, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- వంద రోజుల ప్రణాళికతో సమస్యలు దూరం
- మున్సిపల్ స్పెషలాఫీసర్, అదనపు కలెక్టర్ సుధీర్ కుమార్



అభివృద్ధి పనులపై ఆరా తీస్తున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్ కుమార్

తాండూరు టౌన్: మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ స్పెషలాఫీసర్, అదనపు కలెక్టర్ సుధీర్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి, ఇంజినీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని వార్డులకు మంజూరైన అభివృద్ధి పనులు, పురోగతి తదితరాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణ ప్రగతి, 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధుల కింద కొనసాగుతున్న పనులు, నిలిచిన పనులు, నిధుల విడుదల్లో జాప్యం తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నట్లు వివరించారు. నాణ్యతతో కూడిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. ఉద్యోగుల వేతనాలు, పారిశుద్ధ్యం, టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ తదితర విభాగాల పనితీరుపై సమీక్షించామన్నారు. అనంతరం బసవన్న కట్ట వద్ద జంతు వ్యర్థాలను వేస్తున్నట్లు ఫిర్యాదు అందడంతో ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. జనావాసాల నడుమ వ్యర్థాలు వేయకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను, చిలుకవాగు కాల్వ నిర్మాణ పనులను పరిశీలించారు.

కూల్చివేతలకు సహకరించాలి

పట్టణ ప్రధాన రోడ్డు పనుల విస్తీర్ణానికి ప్రజలు, చిరు వ్యాపారులు సహకరించాలన్నారు. అక్రమ కట్టడాలు నిర్మిస్తే నోటీసులు జారీ చేసి తొలగిస్తామన్నారు. పట్టణంలో ఏర్పడే ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎలాంటి సమస్యలు రాకుండా ఉండాలంటే అక్రమ కట్టడాలను తొలగించక తప్పదన్నారు.

వంద రోజుల ప్రణాళిక

జూన్ 2 నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు మున్సిపల్ ఆధ్వర్యంలో కొనసాగనున్న వంద రోజుల కార్యాచరణ ప్రణాళికకు ప్రజలు సహకరించాలన్నారు. మెప్మా, మున్సిపల్ సిబ్బందితో కలిసి వార్డుల్లో ర్యాలీ నిర్వహిస్తూ, తడి, పొడి చెత్త, పరిసరాల శుభ్రత, తాగునీటి వినియోగం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి

పరిగి: పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మినీస్టేడియం ఎదుట సైడ్ డ్రైనేజీపై సీసీ నిర్మాణానికి సంబంధించిన పనులను ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ తదితరులున్నారు.

‘భూ భారతి’పై అవగాహన అవసరం

తాండూరు సబ్–కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్



ఎల్మకన్నె రెవెన్యూ సదస్సులో తాండూరు సబ్–కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్

తాండూరు రూరల్: భూ భారతి చట్టంపై ప్రతీ రైతుకు అవగాహన అవసరమని తాండూరు సబ్–కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన ఎల్మకన్నె గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్–కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. భూ సమస్యలున్న రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రికార్డుల్లో తప్పులుంటే సరిచేసుకోవాలని సూచించారు. భూ మార్పిడిలో సర్వేయర్ రూపొందించిన నక్షను జత చేసినట్లయితే భవిష్యత్‌లోనూ భూ వివాదాలకు తావుండదని వివరించారు. చంద్రవంచలో డిప్యూటీ తహసీల్దార్ లలిత ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఎల్మకన్నెలో 11 దరఖాస్తులు, చంద్రవంచలో నాలుగు దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ తారాసింగ్ తెలిపారు. మ్యుటేషన్, విరాసత్, పాసు పుస్తకంలో రైతు పేర్ల తప్పులు, భూ విస్తీర్ణంలో సవరణపై ఫిర్యాదులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గోపి, సిబ్బంది బాబు, నర్సింలు, అంజమ్మ, ప్రవీణ్, యాదయ్య, ఇంతియాజ్, ప్రదీప్, నరేశ్, ఉలేందర్, గోపాల్, మహేందర్, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి



విజేత జట్టుకు కప్ అందజేస్తున్న రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట: యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాందార్‌పూర్‌లో నిర్వహించిన బీపీఎల్ (బొంరాస్‌పేట ప్రీమియర్ లీగ్) నిర్వహించారు. తొమ్మిది జట్లలో బొంరాస్‌పేట్ కెప్టెన్స్ జట్టు విజేతగా నిలిచింది. ఆర్‌సీబీ బృందం రన్నరప్‌గా నిలిచింది. ఈ జట్లకు మంగళవారం కప్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింలుగౌడ్, రాంచంద్రారెడ్డి, జయకృష్ణ, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఎల్లకొండలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎల్లకొండ రైతు వేదికలో రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే రైతులకు ఉచితంగా జొన్న, వరి, కంది విత్తనాలు పంపిణీ చేశారు. గతంలో ఏ ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు పంపిణీ చేసిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్‌నాయక్, ఏఆర్ఎస్ తాండూరు శాస్త్రవేత్త యమున, ఏడీఏ శంకర్‌రాథోడ్, ఏఓ జ్యోతి, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ప్రకాశ్, ఏఈఓలు ఆదిల్, లక్ష్మి, పవన్, మల్లేశ్, రమాదేవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సాగు సలహాలకు రైతు నేస్తం

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి



విత్తనాలు పంపిణీ చేస్తున్న మోహన్‌రెడ్డి, పవన్‌చంద్రారెడ్డి

ధారూరు: రైతులకు సాగు సలహాలు ఇచ్చేందుకు రైతునేస్తం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ధారూరు రైతువేదికలో వాతావరణ ఆధారిత సూచనలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన ముగ్గురు రైతులకు వేర్వేరు రకాల విత్తనాలు పంపిణీ చేశారు. కందిలో ఆశ, జొన్నలో పీవైపీఎస్–2, వరిలో ఆర్ఎన్ఆర్–15048 రకాల విత్తనాలు పంపిణీ చేశారు. వీటిని సాగు చేసే రైతుల పొలాలు తరచూ పరిశీలిస్తూ నాణ్యమైన ఉత్పత్తి వచ్చేలా చేయడం తమ బాధ్యత అని ప్రధాన శాస్త్రవేత్త కె.పవన్‌చంద్రారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సూర్యప్రకాశ్, ఏఈఓలు సంతోశ్, సంజూరాథోడ్, మంజుల, మల్లేశ్, హరిప్రసాద్, రైతు నాయకులు పాల్గొన్నారు.

టీబీ పరీక్షలు తప్పనిసరి

టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ రవీంద్రయాదవ్



అగ్గనూరులో టీబీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

యాలాల: రెండు వారాల పాటు ఎవరికైనా దగ్గు ఉంటే తప్పనిసరిగా టీబీ పరీక్షలు చేయించుకోవాలని జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ రవీంద్రయాదవ్ సూచించారు. మంగళవారం మండలంలోని అగ్గనూరు ఆరోగ్య ఉప కేంద్రంలో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండల వైద్యాధికారి రుబియానాజ్‌తో కలిసి వైద్య శిబిరం నిర్వహించారు. రెండు వారాల పాటు దగ్గు, సాయంత్రం వేళ జ్వరం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, చాతిలో నొప్పిలాంటి లక్షణాలు కలిగిన 310 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. వారికి స్క్రీనింగ్ పరీక్షల అనంతరం 115 మందికి ఎక్స్‌రే తీసి వ్యాధిని గుర్తించినట్లు చెప్పారు. పాజిటివ్ వచ్చిన వారికి ఆరునెలల పాటు ఉచితంగా మందులతో పాటు పౌష్టికాహారం కోసం నెలకు రూ. వెయ్యి చొప్పున రోగి ఖాతాలో జమ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ సుశీల, సూపర్‌వైజర్లు శోభారాణి, పల్లె దవాఖాన వైద్యురాలు భువనేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ వైష్ణవి, టీబీ సూపర్‌వైజర్ రహత్ అలీ, ఏఎన్ఎంలు వీరమణి, రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

చెరువులోపడి మహిళ మృతి

దుద్యాల్: బహిర్భూమికి వెళ్లిన మహిళ చెరువులో పడి మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని కుదురుమల్లలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తు లు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పంతుల సాయమ్మ(49) ముంబాయి, హైదరాబాద్ నగరాల్లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటుంది. నెల రోజుల క్రితం గ్రామానికి వచ్చిన ఆమె ఆదివారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లింది. ఆసయమంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. తిరిగి ఆమె ఇంటికి రాకపోవడంతో చెరువులోనే పడి ఉంటుందని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు భావించారు. మంగళవారం చెరువు నీటిలో మృతదేహం తేలియాడడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న ఎస్ఐ యాదగిరి వివారలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కొడంగల్ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. మృతురాలి కూతురు జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గ్రామస్తులందరితో కలివిడిగా ఉండే సాయమ్మ మరణ వార్త తెలుసుకున్న మహిళలు చెరువు వద్దకు చేరుకుని విలపించారు.

రెవెన్యూ సదస్సులు పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

పరిగి: రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మంగళవారం రెవెన్యూ సదస్సులు ప్రారంభమవగా ఆయన యాబాజీగూడలో పాల్గొని రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులకు అధికారులు తప్పక హాజరవాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం సూచించిన గ్రామాల్లో సదస్సులు నిర్వహించి రైతుల దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ఏళ్ల నుంచి భూ సమస్యలతో సతమవుతున్న రైతులకు ఇది సువర్ణావకాశం అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న యూటీఎఫ్ నాయకులు, తదితరులు

అనంతగిరి: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యా బోధన చేపడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేశ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం బడీడు పిల్లల్ని బడిలోనే చేర్పించాలని టీఎస్ యూటీఎఫ్ వికారాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రచార వాహనాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, ఉపాధ్యక్షుడు నర్సింలు, కార్యదర్శి బాబురావు కృష్ణవేణి పవన్ కుమార్ ముత్తెప్ప సలీం వికారాబాద్ మండల అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి తిరుపతి, కోటపల్లి మండల అధ్యక్షుడు రామచంద్రయ్య, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి బలవన్మరణం



దస్తయ్య (ఫైల్)

దోమ: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. బాలాపూర్ గ్రామానికి చెందిన బాపురం దస్తయ్య(45) కొద్ది రోజుల క్రితమే కూతురు వివాహం ఘనంగా జరిపించాడు. మామిడి తోటల వ్యాపారం చేకుంటూ, చిట్టీలు నడుపుతూ, చిన్న హోటల్ కొనసాగిస్తున్నాడు. మామిడి, చిట్టీల వ్యాపారంలో నష్టంతో పాటు హోటల్ కూడా సరిగా నడవక ఆర్థికంగా నష్టపోయాడు. దీంతో మానసికంగా కృంగిపోయిన ఆయన మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య వెంకటమ్మ, కూతురు అంజలి, కుమారులు సాయి, హర్ష ఉన్నారు.

ఆటస్థలం వినియోగంలోకి తీసుకువస్తాం

తాండూరు రూరల్: ఆటస్థలాన్ని వినియోగంలోకి తీసుకువస్తానమి తాండూరు డివిజన్ పంచాయతీరాజ్ ఈఈ సత్యానారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తాండూరు మండలం చెంగోల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో బండరాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యానారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు పాఠశాలను సందర్శించామన్నారు. పాఠశాల ఆవరణలో బండ రాళ్ల వల్లే విద్యార్థులు క్రీడాలకు దూరంగా ఉంటున్నారన్నారు. సత్వరమే వాటిని తొలగించి ఆటలకు ఉపయోగపడేవిధంగా పనులు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ నాగభూషణం పాల్గొన్నారు.

అక్రమంగా గోవులను తరలిస్తే చర్యలు

నవాబుపేట: అక్రమంగా పశువులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ అరుణ్‌కుమార్ హెచ్చరించారు. మండల పరిధిలోని మైతాప్‌ఖాన్‌గూడ గ్రామం వద్ద మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో పశువులను అక్రమంగా తరలించొద్దన్నారు. ఎవరైనా రైతులు ఎద్దులను మార్కెట్‌లో కొనుగోలు చేసి వాహనాల్లో తరలించేక్రమంలో అందుకు సంబంధించిన పత్రాలు ఉంచుకోవాలన్నారు.

పాడి పశువుల పట్టివేత

కుల్కచర్ల: అనుమతులు లేకుండా తరలిస్తున్న పాడి పశువులను బీజేపీ నాయకుల సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రమేశ్ తెలిపిన ప్రకారం..కుల్కచర్ల మండలం అంతారం గ్రామంలో అబ్జల్ తన డీసీఎంలో 2ఆవులు, 2గేదెలు, 7కోడెలను తరలిస్తున్నాడు. విషయం తెలుసుకున్న బీజేపీ శ్రేణులు, మండల అధ్యక్షుడు వెంకటయ్యముదిరాజ్ స్థానిక పోలీసుల సహకారంతో డీసీఎం వద్దకు వెళ్లి పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా పాడిపశువులను తరలిస్తున్న నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విక్రయిస్తే ఊరుకోం

కుల్కచర్ల: మాసం విక్రయదారులకు గోవులను విక్రయిస్తే ఊరుకోమని బీజేపీ మండల అధ్యక్షుడు జి.వెంకటయ్య ముదిరాజ్ అన్నారు. మంగళవారం మండలం కేంద్రం మీదుగా నారాయణపేట జిల్లా కొత్తపల్లి వైపు పాడి పశువులు తీసుకెళ్తున్న డీసీఎం, బొలేరో వాహనాలను అడ్డుకున్నారు. సంబధిత వ్యక్తులను నిలదీయడంతో సర్దార్‌నగర్ పశువుల సంత నిలిపివేయడంతో తమ గ్రామానికే తీసుకెళ్తున్నామని బదులిచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న ఎస్ఐ రమేశ్ నిందితుల వద్ద ఎడ్ల చిట్టీలు ఉండటంతో నిషేధిత సమయంలో పశువులను విక్రయించడానికి తీసుకువెళ్లరాదని సూచించారు. గోవులను విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

జిల్లా వ్యవసాయాధికారితో ‘సాక్షి’ ఫోన్ ఇన్

వికారాబాద్ వానాకాలం సీజన్‌లో పంటల సాగు, విత్తనాల ఎంపిక, తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు ఎరువుల వినియోగం తదితర సందేహాలు తీర్చుకునేందుకు ‘సాక్షి’ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డితో ఈనెల 6న ఉదయం 10నుంచి 11:30 గంటల వరకు ‘ఫోన్ ఇన్’ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రైతులు ఆయనతో మాట్లాడి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.





తేదీ : 06-06-2025

సమయం : ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్లు :

8977755890, 9010299041

బీఏఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: 2025–26 విద్యాసంవత్సరంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం(బీఏఎస్ఎస్) ప్రవేశాల కోసం షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పి.కమలాకర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 1వ తరగతి(నాన్ రెసిడెన్షియల్), 5వ తరగతి (రెసిడెన్షియల్)కు కుటుంబానికి ఒకరికి అవకాశం ఉంటుందన్నారు. దరఖాస్తులు స్థానిక జిల్లా వారై ఉండాలన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం పట్టణ ప్రాంతాలవారికి రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50లక్షలకు మించొద్దన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు 1వ తరగతికి ఆదాయ, రెసిడెన్స్, జనన ధ్రువీకరణపత్రం(1.6.2019–31.05.2020) 5వ తరగతివారు వీటితో పాటు 4వ తరగతి బోనోఫైడ్‌సర్టిఫికెట్ జతపరిచి జూన్ 16 వరకు కలెక్టరేట్‌లోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. దరఖాస్తు ఫారం. మరింత సమాచారం కోసం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయం, కలెక్టరేట్ కాంప్లెక్స్ రూం నంబర్ ఎఫ్.10లో సంప్రదించాలన్నారు.

ఐటీఐ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: ఐటీఐ మొదటి సంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రవేట్ ఐటీఐ కళాశాలలో చేరేందుకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని వికారాబాద్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్రబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని చెప్పారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక



బోధనోపకరణలతో పాఠ్యాంశాలు చెబుతున్న టీచర్ సరిత

ధారూరు: ఇంటిగ్రేటెడ్ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ అంశంపై నాగసమందర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సరిత రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో తన బోధనోపకరణాలను ప్రదర్శించారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటండి

సీఎం సూచన



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో నర్సింగ్ భాన్‌సింగ్, గణపతిసింగ్

దౌల్తాబాద్: మాజీ ఎంపీపీ నర్సింగ్‌భాన్‌సింగ్ మంగళవారం నగరంలోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని రాజకీయ అంశాలపై ముఖ్యమంత్రికి వివరించామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని సీఎం సూచించారని తెలిపారు. ఆయన వెంట గణపతిసింగ్ తదితరులున్నారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి దేహశుద్ధి

అనంతగిరి: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తికి దేహశుద్ధి చేశారు. మంగళవారం వికారాబాద్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నవాజ్ అనే వ్యక్తి పట్టణంలో బ్రెయిన్ ట్రీ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ నిర్వహిస్తున్నాడు. ఇక్కడ శిక్షణ కోసం వచ్చిన ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని తెలుసుకున్న కుటుంబ సభ్యులు సెంటర్‌కు చేరుకుని నిలదీశారు. అనంతరం అతన్ని చితకబాది పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పీఎస్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.